ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
1★★
ఆదివారం 20 ఏప్రిల్ 2025



అంజన్న సన్నిధిలో భక్తుల సందడి..



క్యూలైన్‌లో వస్తున్న భక్తులు
2

పంట నష్టంపై పరిహారం అందించాలి

● కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్, ఏప్రిల్, 19 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో పంట దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.25వేలు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ముత్యంపేట గ్రామంతో పాటు పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు, మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షంతో రైతులకు నష్టం వాటిలిందని వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి రఘునందన్‌కు ఫోన్ ద్వారా వివరించారు. రైతులకు పంటల బీమా హామీ ఇచ్చి బడ్జెట్‌లో నిధులు కేటాయించక ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు.కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, తహసీల్దార్, నాయకులు, రతైలు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం మండలంలోని అయిలా పూర్, కల్లూర్, ధర్మారం, సర్పరాజుపూర్, మాదాపూర్, మోహన్ రావుపేట, వెంకటాపూర్‌లో సింగిల్ విండో, ఐకేసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్‌లు ఆదిరెడ్డి, బండి భూమయ్య, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావులు, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం అందజేత

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్పరాజుపూర్ గ్రామానికి చెందిన కొక్కు నడిపి గంగారాం కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల విలువ గల పరిహారం చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అందజేశారు. గంగాధర్ కొన్ని రోజుల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందంగా విద్యుత్‌శాఖ ద్వారా మంజూరైన చెక్కును స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

సెక్రెటరీలు కావలెను..

● వ్యవసాయ మార్కెట్లలో ఇన్‌చార్జీల పాలన
● జిల్లాలో 36 పోస్టులు ఖాళీ
● పంట ఉత్పత్తుల కొనుగోలుపై కొరవడిన పర్యవేక్షణ



జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయమార్కెట్ కార్యాలయాల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. రైతులు పండించిన ఉత్పత్తులను సేకరించే వ్యవసాయ మార్కెట్లపై పర్యవేక్షణ కొరవడింది. జిల్లాలోని ప్రధాన మార్కెట్లు సైతం ఇన్‌చార్జీల పాలనలో కొనసాగుతున్నాయి. ఒక్కో సెక్రెటరీకి మూడు, నాలుగు మార్కెట్ల బాధ్యతలు అప్పగించడంతో పని ఒత్తిడితో సతమతం అవుతున్నారు. దీంతో మార్కెట్ కార్యదర్శులు అదనపు భారంతో సరియైన విధంగా బాధ్యతలను నిర్వర్తించలేకపోతున్నారు.

● మార్కెట్‌లలో ఖాళీగా 36 పోస్టులు..

జిల్లాలోని 13 వ్యవసాయ మార్కెట్లలో 48 పోస్టులు మంజూరు కాగా 12 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన 36 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మార్కెట్లలో సెక్రెటరీతో పాటు అసిస్టెంట్ సెక్రెటరీ, అటెండర్, జూనియర్ మార్కెట్ ఆఫీసర్, మార్కెట్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్, ఎల్‌డీసీ, అకౌంటెంట్, టైపిస్టు వివిధ పోస్టులు ఉండాలి. పలు పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పనిభారం అధికమై అధికారులు, సిబ్బంది సతమతమవుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల పరంగా జిల్లా ముందు వరుసలోనే ఉంటుంది. దాదాపుగా అన్ని మార్కెట్లు ఆయా సీజన్లలో పంట ఉత్పత్తులతో కళకళలాడుతుంటాయి. మార్కెట్‌లో పర్యవేక్షణ కరువైంది. రెగ్యులర్ సెక్రెటరీలు ఉన్నట్లయితే ఎప్పటిప్పుడు రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటారు. పంట కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని నియంత్రిస్తారు. కానీ ఇన్‌చార్జీల పాలన ఉండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. జగిత్యాల జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా ఉన్న ప్రకాశ్ సైతం సిరిసిల్ల, కరీంనగర్ తదితర జిల్లాల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

●ఒక్కో కార్యదర్శికి మూడింటి బాధ్యతలు

జిల్లాలో 13 మార్కెట్ కమిటీలు ఉండగా కేవలం ముగ్గురు మార్కెట్ కార్యదర్శులు మాత్రమే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన మార్కెట్ కమిటీల్లో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజశేఖర్ స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీగా పదోన్నతికి దగ్గరలో ఉన్నట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి. కోరుట్ల మార్కెట్‌లో సెక్రెటరీగా ప్రశాంత్, మెట్‌పల్లి మార్కెట్‌లో సెక్రెటరీగా ఇంద్రసేన రెడ్డిలు మాత్రమే రెగ్యులర్‌గా పనిచేస్తున్నారు. మిగిలిన పది మార్కెట్ కమిటీలలో ఇన్‌చార్జీలు పనిచేస్తున్నారు. మల్యాల అసిస్టెంట్ మార్కెటింగ్ సెక్రెటరీగా పనిచేస్తున్న వరలక్ష్మీ జిల్లాలోని గొల్లపల్లి, పెగడపల్లి మార్కెట్‌లకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. జగిత్యాల సెక్రెటరీ రాజశేఖర్ రాయికల్ మార్కెట్ సెక్రెటరీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మెట్‌పల్లి మార్కెట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న హరికృష్ణ వెల్గటూరు ఇన్‌చార్జీ సెక్రెటరీగా, మేడిపల్లి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సురేందర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఇన్‌చార్జీ సెక్రెటరీగా, సిరిసిల్ల జిల్లా బోయినపల్లి అసిస్టెంట్ సెక్రెటరీగా పనిచేస్తున్న రమణ జిల్లాలోని మేడిపల్లి, కథలాపూర్ ఇన్‌చార్జీ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. ధర్మపురిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వెంకట నర్సయ్య అక్కడే ఇన్‌చార్జీ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

● వ్యాపారులదే ఇష్టారాజ్యం..

జిల్లాలోని పలు వ్యవసాయ మార్కెట్లలో కార్యదర్శులు, ఇతర అధికారులు, ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉండడం, ఇన్‌చార్జీల పాలన కొనసాగుతుండడంతో మార్కెట్లలో వ్యాపారులు, అడ్తీదారులు, ఖరీదుదారులు, కమీషన్ ఏంజట్లదే ఇష్టారాజ్యంగా తయారైంది. వ్యవసాయ మార్కెట్లలో నిబంధనల మేరకు కొనుగోళ్ల, చెల్లింపుల ప్రక్రియ జరగాల్సి ఉండగా అడుగడుగున రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన మార్కెట్లు అయిన జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలతో పాటు ఇతర మార్కెట్లలో తక్‌పట్టీల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా నగదుకోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులపై ఒక్కశాతం పన్నును మార్కెట్‌కు కట్టాల్సి ఉంటుంది. చాలా వరకు జీరో వ్యాపారం జరుగుతున్నట్లుగా ఆరోపణలున్నాయి. మెట్‌పల్లి మార్కెట్‌లో పసుపు కొనుగోళ్లలో ఈ నామ్ అమలు అంతంత మాత్రమేనని విమర్శలున్నాయి. జగిత్యాల మార్కెట్‌లో మామిడి కొనుగోళ్ల అధిక శాతం జీరోలోనే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ యార్డుల్లో సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకంగా ఉంటుంది. అధికారులు, సిబ్బంది సరియైన సంఖ్యలో లేకపోవడం, ఉన్న పోస్టులు ఖాళీగా ఉండడం, ఇన్‌చార్జీల పాలనతో అటు రైతులకు నష్టం జరుగుతుండగా, ఇటు మార్కెట్ కమిటీలు సైతం ఆదాయాన్ని కోల్పోతున్నాయి. వ్యవసాయ మార్కెట్లలో ఖాళీల ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సంబంధిత వర్గాలు కోరుతున్నాయి.

ఖాళీలను ఉన్నతాధికారులకు నివేదించాం..

-ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి



జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఖాళీ పోస్టుల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. మార్కె టింగ్ శాఖలో దాదాపుగా అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొత్త పోస్టులు మంజూరు, ఉన్న పోస్టులను భర్తీ చేయడంపై దృష్టి సారించాం. ప్రస్తుతం ఉన్న అధికారులు, ఉద్యోగులతో మార్కెట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం.

'సమస్యల సత్వర పరిష్కారానికే భూ భారతి'

వెల్గటూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారానికే సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చా రని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరిలక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భూభా రతి కొత్త చట్టంపై వెల్గటూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రైతుల మేలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భూభారతి చరిత్రాత్మకమని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ధరణి చట్టాన్ని రద్దు చేసి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూ భారతి కొత్త చట్టాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. భూ వివరాలు అన్ని గ్రామ పంచాయతీల స్థాయిలో సెక్రెటరీల వద్ద అందుబాటులో ఉంటుందని తెలిపారు. భూములకు రక్షణ కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన పెంచుకొని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసుదన్, తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఏఎంసీ ఛైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్య క్షులు రత్నార్, గూడ రాంరెడ్డి, మం డల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, మెరుగు మురళి, సందీప్‌రెడ్డి, పూదరరి రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'భూభారతితో వివాదాలు పరిష్కారం'

భీమారం: భూ వివాదాలకు ముగింపు పలికేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. భీమారంలో శనివారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కారం కానివాటిని సీసీఎల్ఏ, ల్యాండ్ ట్రిబ్యునల్‌లో పరిష్కరించుకోవచ్చునని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ రవికిరణ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వినోద్, ఏవో షాహిద్ అలీ, మేడిపల్లి, భీమారం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపుపై ఫిర్యాదు

మల్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని పోచమ్మవాడ రాజీవ్ రహదారి పక్కన గల హరితహారం చెట్లను తొలగించారంటూ ముదాం మల్లేశం అనే వ్యక్తి ఎంపీడీవో స్వాతికి ఫిర్యాదు చేశారు. 14 సంవత్సరాల క్రితం నాటిన కానుగ మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి నీడను అందిస్తున్నాయిన చెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకో వాలని కోరారు. మల్యాల పంచాయతీ ఈవో శ్రీకాంత్‌ను సంప్రదించగా కోతులతో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని స్థానికుల విన్నపంతో చెట్ల కొమ్మలు తొలగించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పోతారం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు రామన్నపేట ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పోతారం, రాజారం గ్రామాలకు ఉదయం 8నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని తెలిపారు.

విమర్శలకు చేతలతో సమాధానం చెప్తా

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తనపై విమర్శలు చేసే వారికి మాటలతో కాకుండా చేతలతో సమాధానం చెప్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూకపెల్లి నర్సింగాపూర్ శివారులో గల సర్వే నెంబర్లు 172, 183-192, 193, 194, 198, 421, 428, 437 సర్వే నెంబర్లను గతంలో అర్బన్ హౌసింగ్ కాలనీగా ఏర్పాటు చేయగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలుగా చేపట్టిన వాటిని నేడు జగిత్యాల మున్సిపాలిటీలో కలపడం జరిగిందన్నారు. గతంలో నూకపెల్లి అర్బన్ హౌసింగ్ కాలనీని గ్రామపంచాయితీ చేయడం, మున్సిపల్‌లో కలపకపోవడం వల్ల అభివృద్ధికి నోచుకోలేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి నియోజక వర్గానికి 1500 ఇండ్లు మంజూరయ్యాయన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం గత ప్రభుత్వంలో నిధుల లేమితో ఆలస్యం అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.32 కోట్లు మంజూరు చేశారన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మెన్‌లు అడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, వైస్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్. నాయకులు క్యాదాసు నాగయ్య, బాల ముకుందం, జగన్, గంగమల్లు, అనిల్ పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. కొనుగోళ్లపై కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, తాళ్లు, తరుగు పేరిట ఎటువంటి కోతలు పెట్టవద్దని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరా శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాలలో కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్ల, సన్నబియ్యం సరఫరాపై సమీక్షించి మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో ఐకేపీ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి మనోజ్‌కుమార్, డీఆర్‌డీఓ రఘువరన్ పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్‌కు చెందిన మ్యాకల గంగాధర్-సుజాతల కూతురు గౌరు వివాహానికి జగిత్యాల పట్టణానికి చెందిన మార్కండేయ యువజన స్వచ్ఛంద సంస్థ తరపున 10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. పట్టణానికి చెందిన గీతా సిల్క్ హౌజ్ నిర్వాహకులు కస్తూరి శశిధర్ పట్టు చీరను అందించారు. కార్యక్రమంలో మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్, ఆకుబత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి'

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ శనివారం విశ్వ హిందూ పరిషత్ నాయకులు మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో చిన్న పిల్లలపై, మహిళలపై హింస జరుగుతున్న సిఎం మమత బెనార్జీ పట్టన్నాట్లు వ్యవహరిస్తోందని అక్కడి హిందువులు ఇతర రాష్ట్రలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఎదురైందని అన్నారు. బంగ్లాదేశ్ నుండి వచ్చిన రోహింగ్యాలకు అక్కడ స్థానం కల్పించి మమత బెనార్జీ ప్రభుత్వం హింసను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు పోహర్ తుక్కారాం, నాయకులు మర్రి భాస్కర్, సత్యనారణ, రాజశేఖర్, రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

●**ధర్మపురి:** పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు ధర్మపురి మండల తహసీల్దార్ కృష్ణచైతన్యకు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సామాజిక సమరసత ప్రాంత టోలి సభ్యులు అల్లం దుర్గప్రసాద్, జిల్లా ప్రముఖ్ కస్తూరి రాజన్న, నగర సహ కార్యదర్శులు వెనగందుల రవి, కలికోట రాజేష్, భజరంగ్‌దళ్ నగర సహ సంయోజక్ ఆసం సురేష్, నగర సత్సంగ్ ప్రముఖ్ నలుమాసు శంకరయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షులు భాస్కర్, తిరుమన్‌దాసు సత్యనారాయణ పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** బెంగాల్‌లో హిందువులపై దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం తహసీల్దార్ కార్యాలయంలో విశ్వహిందూపరిషత్ నాయకులు వినతి పత్రం అందించారు. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించి హిందు కుటుంబాలకు రక్షణ కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు బోగ రాకేష్, ఎర్రోజు శ్రీధర్, అంకం జనార్ధన్, కార్తిక్, రామస్వామి, దేవేందర్, దేవరాజం, జనార్ధన్, సత్యం, లక్ష్మన్ తదితరులు ఉన్నారు.

'మానవాళి రక్షణ కోసమే క్రీస్తు జననం'

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మానవాళి రక్షణ కోసమే క్రీస్తు జననం అని మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. క్రైస్తవ సంఘాల ఆధ్వ ర్యంలో ధర్మపురి రోడ్‌లోని వెస్లీ చర్చి జగిత్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీని నిర్వహించగా మాజీ ఛైర్‌పర్సన్ జెండా ఊపి ప్రారంభించారు. మానవాళి పాప విమోచనానికి యేసు క్రీస్తు తన ప్రాణాలను అర్పించిన రోజును గుడ్ ఫ్రైడేగా, తిరిగి మూడో రోజును ఈస్టర్‌గా జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ జీవరత్నం, డాక్టర్ సిల్వన్, బెన్నీ, జాన్ వెస్లీ, విఘ్నేష్, చర్చి ఫాస్టర్లు ముద్దమళ్ల ప్రభాకర్‌తో క్రైస్తవులు పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఛైర్‌పర్సన్ జ్యోతి

జాబ్‌మేళాలో 33మంది ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలోని తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్మెంట్ స్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 58మంది విద్యార్థినులు పాల్గొనగా, 33 మంది అర్హత సాధించినట్లు శ్వాన్ బిజినెస్ సర్వీసెస్ ఎండీ మణిదీప్ అడువాల తెలిపారు.

ఎంపికైన అభ్యర్థులకు ప్రిన్సిపాల్ రామకృష్ణ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ నీరజతో పాటు అధ్యాపకులు, అభ్యర్థులు, కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● కలెక్టర్‌కు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో వరి ధాన్యం వేగవంతంగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ సత్యప్రసాద్‌కు శనివారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి లేఖను పంపారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం ఆరంభింపజేయాలని కోరారు. పలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ తూకం పనులు నిర్వర్తించకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో అకాలవర్షాలు కురుస్తుండడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, తక్షణమే వరిధాన్యం కొనుగోలు నిబంధనలలో ప్రత్యేకించి 17శాతం తమకు లోబడి సమకూరుతున్న పరిస్థితుల్లో ధాన్యాన్ని వెనువెంటనే తూకాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య ప్రసాద్‌కు పంపిణీ లేఖలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి కోరారు.

జేఈఈ ఫలితాల్లో 'అల్ఫోర్స్'కు ర్యాంకుల పంట



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఐఐటీ జేఈఈ(మెయిన్స్) 2025 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కరీంనగర్ లోని అల్ఫోర్స్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.శరణ్య 49వ ర్యాంకుతో అత్యుత్తమ స్థానంలో నిలువగా, పి శ్రీహర్ష 244 ర్యాంకు, ఎన్ అనిరుద్‌సాయి 272, డి విశాల్ 329, జె వామిక 350, టి ప్రణతి 456, ఇ అంకిత్‌సాయి 574, బి ఆదిత్య 630, టి షివాత్మిక 646, వి హృషికేష్ 703, మహ్మద్ అబ్దుల్ 968, పవార్నాల్, ఆర్ సుమిత్‌కుమార్, డి కార్తిక్‌రెడ్డి, మహ్మద్జుల్లన్, బి విష్ణు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని ఇనుమడింపచేశారన్నారు. రానున్న అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐఐటీ, నీట్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు రాణించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఘనవిజయం సాధించినందుకు అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించాయని చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారన్నారు. ఎం రోహిత్ 17, టి కుందన్ 814, పి ఈశ్వర్‌ముఖేష్, ఎం అంజలి 2575, బి.అక్షర 2992, ఎం.తరుణ్ 5949, జి.నందిని 7464 ర్యాంకుతోపాటు 20వేల లోపు 15 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్‌కు హాజరైనవారిలో 40 శాతం మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. అనునిత్యం పర్యవేక్షణ, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నిండంతో ఇంతటి ఘనవిజయం సాధించామన్నారు. సంస్థ స్థాపించిన నాటి నుంచి అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు రాణిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విజయకేతనం చూపిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

ట్రినిటి కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎ రఘుపతి అనే విద్యార్థి జాతీయస్థాయిలో 138వ ర్యాంకు, ఎ హేమంత్ 132, డి సాయిసరణ్‌కుమార్ 313, ఎస్ పరమేశ్వర్‌రెడ్డి 344, ఎ ఫణీందర్ 409, ఆర్ సాయికిషోర్ 587, వి అదీప్ 751, డి మహేశ్ 974, ఆర్ మనోజ్ 1262, బి సిద్ధిక 1551 ర్యాంకు సాధించారు. కేవలం ఒకే బ్రాంచి నుంచి 1000లోపు ఎనిమిది ర్యాంకులతో పాటు పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 83 శాతం మంది విద్యార్థులు జేఈఈ-అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో, నిర్దిష్టమైన ప్రణాళిక, ఉన్నతమైన విద్యా బోధనతో ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. అనంతరం చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ర్యాంకులు సాధించడం ట్రినిటి కళాశాలకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆయా బ్రాంచీల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన మడ్డి తిరుపతి (50) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తిరుపతి తన దాబా ఇంటిపై మరో మరో రెండు రూములను నిర్మించేందుకు ఇటుకల గోడను నిర్మిస్తున్నారు. ఈ 12న పనులను పరిశీలించేందుకు ఇంటిపైకి వెళ్లాడు. నూతనంగా నిర్మిస్తున్న గోడను పట్టుకోవడంతో గోడకూలీ కిందపడ్డాడు. తీవ్ర గాయాల పాలైన తిరుపతిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్థరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ రుణం ఇప్పిస్తానని మోసం చేసిన పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన అమ్ముల అశోక్‌యాదవ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వల్లంపట్ల గ్రామానికి చెందిన పెంటల మల్లయ్య వద్దకు వెళ్లి ఎస్సీ పేరు మీదు ట్రాక్టర్ కొనుగోలు చేస్తే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ ఇప్పిస్తానని నమ్మించి రూ.50వేలు తీసుకున్నాడు. కొద్దిరోజులకు సబ్సిడీ మంజూరు అయినట్లు నకిలీ ప్రొసీడింగ్ కాపీ అందించాడు. వంతడుపుల గ్రామానికి చెందిన బోయిని పర్శరాంకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం ఇప్పిస్తానని చెప్పి రూ.50వేలు తీసుకొని నకిలీ ప్రొసీడింగ్ కాపీ అందించాడు. పర్శరాం దీనిని తీసుకొని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడగగా నకిలీదని తేలింది. దీనితో బాధితులు ఫిర్యాదు చేయగా శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పచ్చదనానికి గొడ్డలిపెట్టు

యథేచ్ఛగా హరితహారం చెట్ల నరికివేత

రహదారి వెంట వృక్షాలకు రక్షణ కరువు

చందుర్తి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఏటా వానాకాలంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు, ఇళ్లు, పొలాలు, చెరువులు గట్లపై ప్రతిష్ఠాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా చేపడుతున్నారు. అవి పెరిగి పెద్దవి కాగానే విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చందుర్తి మండలంలోని మూడపల్లి, మర్రిగడ్డ, లింగంపేట, మల్యాల తదితర గ్రామాల్లో పదేళ్లుగా నాటిన మొక్కలు పెరిగి పెద్దవి కాగా విద్యుత్ అధికారులు తీగలకు అడ్డువస్తున్నాయని, రైతులు తమ పంట పొలాలపై చెట్ల నీడతో పంటలు పండవని చెట్లను మొదళ్ల నుంచి నరికేస్తున్నారు. గతంలో రోడ్లకిరువైపులా ఉపాధిహామీ, అటవీ శాఖ అధికారులు, గ్రామపంచాయతీలను భాగస్వామ్యం చేస్తూ పెద్దఎత్తున మొక్కలను నాటించారు. ఒక్కొక్క గ్రామాల్లో వేలాది మొక్కలు నాటారు. వాటిలో దాదాపు 80 శాతం మేర ఏపుగా పెరిగాయి. ప్రధాన రోడ్లకిరువైపులా ఇప్పటికే పలుమార్లు చెట్లను నరికేశారు. అయినా అవి పెరుగుతుంటే అధికారులు విద్యుత్ తీగలకు అడ్డువచ్చే చెట్ల కొమ్మలతో పాటు ఇతర చెట్లను సైతం నరికేస్తున్నారు. పలుచోట్ల మొదళ్ల వరకు నరికేసి చేతులు దులుపుకుంటున్నారు.



మూడపల్లిలో బైపాస్ రోడ్డులో నరికిన చెట్లు

చెట్లను నరికివేస్తే చర్యలు తీసుకుంటాం..

రాజయ్య, చందుర్తి ఏపీవో



హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను తొలగించినా, చెట్లను నరికివేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జరిమానాతోపాటు కేసులు కూడా నమోదు చేయిస్తాం. మొక్కలు, చెట్లను నరికి వేయడం, తగలబెట్టడం లాంటి పనులు చేయవద్దు.



మూడపల్లి శివారులో నరికిన హరితహారం చెట్లు

కన్నెత్తి చూడని అధికారులు

గ్రామపంచాయతీల్లో కొన్ని సంవత్సరాల నుంచి పెంచిన హరితహారం చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. చెట్లు తిరిగి చిగురించేందుకు వీలు లేకుండా మొదళ్ల వరకు నరికేస్తున్నారు. తీగలకు తగిలే కొమ్మలను తొలగించకుండా మొత్తం చెట్లను నరికి వేస్తున్నుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టించుకోని అటవీ శాఖ అధికారులు పెద్దఎత్తున రోడ్లకిరువైపుల చెట్లు నరికివేతకు గురవుతున్నప్పటికీ ఉపాధిహామీ అధికారులు కానీ, అటు అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సొంత ప్లాట్లలో పెరిగిన చెట్లను తొలగించడానికి అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురిచేసే అధికారులు ఎంతో ప్రజాధనం వెచ్చించి హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికేస్తున్నా కనీస చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చెట్లు నరికివేతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జేఈఈ ఫలితాల్లో
'ఎస్ఆర్' విద్యార్థుల జయకేతనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఆర్ కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జయకేతనం ఎగుర వేసినట్లు కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. మండలంలోని అలుగునూర్‌లోగల ఎస్ఆర్ కళాశాల ఆవరణలో శనివారం మీడియా సమావేశంలో మాట్లా డారు. జేఈఈ మెయిన్స్‌లో తమ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు అర్హత సాధిం చారని తెలిపారు. ఎస్ఆర్ కళాశాలకు చెందిన దాదాపు 185 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌లో విజయం సాధించినట్లు తెలిపారు. వై భరణి శంకర్ జాతీయ స్థాయి లో 88వ ర్యాంకు సాధించగా, బి సురేష్ 98వ ర్యాంకు, ఎ కార్తిక్ 584వ ర్యాంకు, లకావత్ మాధవ్‌చరణ్ 707వ ర్యాంకు, లునావత్ రామ్ చరణ్ 777వ ర్యాంకు, పత్తెం హృషికేష్ 796వ ర్యాంకు సాధించారని వివరించారు. వారితో పాటు మరో ఏడుగురు విద్యార్థులు ఆరువేల లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కరీంనగర్ డీజీఎం వాసుదేవరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుప తిరెడ్డి, ప్రిన్సిపాల్స్‌ను అభినందించారు.

జమ్మికుంట సప్తగిరి ఆసుపత్రి పర్మిషన్ రద్దు

- సీజ్ చేస్తున్నట్లు వైద్యశాఖ నోటీసులు

జమ్మికుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల్లో అక్రమాలు జరిగాయని సీఐడీ అధికారులు నిగ్గు తేల్చారు. దీంతో ఆసుపత్రి అనుమతి రద్దు చేసి, సీజ్ చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయిన కూడా ఆసుపత్రి నడిపిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు శనివారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి షెటర్ ఎందుకు తీసి పెట్టారని నిర్వాహకులను ప్రశ్నించారు. ఇందులో డెంటల్ ఆసుపత్రి ఉందని, మిగితా వైద్యసేవలు మూసి వేశామన్నారు. అంతేకుండా ఇందులో నుంచి ఇంట్లోకి వెళ్లాల్సిన దారి ఉందని డెంటల్ డాక్టర్ రామకృష్ణ వైద్యాధికారులకు తెలిపారు. మెయిన్ షెటర్ దగ్గరుండి మూసి వేయించారు.

● ఎనిమిది నెలల క్రితం సీఐడీ విచారణ

సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల అవకతవకలపై సీఐడీ అధికారులు గత ఏడాది సెప్టెంబరు 10వ తేదీన తనిఖీలు చేపట్టారు. రోగులకు చికిత్స చేయకుండా చేసినట్లుగా బిల్లులు సృష్టించిన వ్యవహారంలో వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించారు. ఆసుపత్రి డాక్టర్ వంశీని సైతం విచారించారు. తనకు తెలియకుండా ఎవరో బిల్లులు ఇచ్చారని వైద్యుడు వివరణ ఇచ్చాడు. అవకతవకలు జరిగినట్లుగా నిర్ధారించిన సీఐడీ వైద్యారోగ్య శాఖకు నివేదికను అందించింది. ఆ సమయంలోనే సదరు ఆసుపత్రిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. ప్రస్తుతం ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి మండలం రేకుర్తి సాలెహనగర్‌కు చెందిన మహ్మద్ అహిర్ అజ్మన్(11) అనే బాలుడు చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం... స్థానిక వెంకటేశ్వర కాలనీ శ్మశానవాటిక సమీపంలో ఉన్న ఒక వ్యవసాయ బావి వద్దకు శనివారం ఉదయం అహిర్ అజ్మన్‌తోపాటు అతడి స్నేహితులు మహ్మద్ అన్సర్, మహ్మద్ అర్మన్ చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతున్న సమయంలో అహిర్ అజ్మన్ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునుగుతుండగా స్నేహితులు కాపాడండి అంటూ కేకలు వేశారు. స్థానికులు వచ్చి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే నీట మునిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది తాళ్లు, ఇతర పరికరాల సహాయంతో అహిర్ అజ్మన్ మృతదేహాన్ని బయటకు తీశారు. అహిర్ అజ్మన్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముడి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

స్వగ్రామానికి చేరిన శ్రీనివాస్ మృతదేహం

- తొమ్మిది రోజుల క్రితం దుబాయ్‌లో హత్య

- దమ్మన్నపేట గ్రామంలో విషాదం





స్వర్గం శ్రీనివాస్ మృతదేహం దగ్గర రోదిస్తున్న కుటుంబసభ్యులు, పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో కొద్దిరోజుల క్రితం పాకిస్తానీ చేతిలో హత్యకు గురైన స్వర్గం శ్రీనివాస్ (43) అనే వ్యక్తి మృతదేహం శనివారం ఆయన స్వగ్రామమైన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేటకు చేరుకుంది. దీంతో శ్రీనివాస్ భార్య జమున, కొడుకులు చందు, సూర్య, తల్లి రాజవ్వ బోరున విలపించారు. స్వర్గం శ్రీనివాస్ అనే వ్యక్తిని తొమ్మిది రోజుల క్రితం పాకిస్తానీ దారుణంగా నరికి చంపారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లి అక్కడ ఓ బేకరిలో పని చేస్తుండేవాడు. పని ఒత్తిడి, మత విద్వేషం కూడా తోడు కావడంతో సహోద్యోగి అయిన పాకిస్తానీ దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్, నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్ అనే ఇద్దరు వ్యక్తులను నరికి చంపాడు. అప్పటి నుంచి శ్రీనివాస్ భార్య, కొడుకులతో పాటు తల్లి స్వర్గం రాజవ్వ మృతదేహం రాకకోసం నిత్యం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు శ్రీనివాస్ మృతదేహం శనివారం ఇంటికి చేరుకోగా కుటుంబసభ్యులు విలపించారు.

● అంత్యక్రియల్లో పాల్గొన్న విప్ లక్ష్మణ్‌కుమార్

స్వర్గం శ్రీనివాస్ మృతదేహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం నివాళులర్పించారు. గోదావరి నది వద్ద మృతుడి అంత్యక్రియలు నిర్వహించగా అంతిమ యాత్రలో విప్ పాల్గొని పాడె మోసారు. మృతుడి అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందించారు. కలెక్టర్ ప్రభుత్వం పక్షాన రూ.15 వేలు అంత్యక్రియల ఖర్చు కోసం అందించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని విప్ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబాయ్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హత్యకు గురయ్యారని తెలిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మృతదేహాలను స్వదేశానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎన్ఆర్ఐ పాలసీ కింద రూ.5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ జాబ్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై సీసీఎస్ పోలీసుల దాడి

మేడిపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వకోట గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి రూ. 11,100, ఏడు మొబైల్ ఫోన్స్‌ను సీజ్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పేకాటలో పట్టుబడ్డ వారిని మేడిపల్లి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్ రమేష్, అఫ్రోజ్, కమలాకర్ పాల్గొన్నారు.

గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌లో..

గంగాధర(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్ నగర్‌లో పేకాట ఆడుతున్నవారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పేకాడుతున్నారని పక్కా సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 9,600 రూపాయలు స్వాధీనం చేసుకొని నలుగురి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చిన వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరు గ్రామానికి చెందిన రంగు శ్రీనివాస్ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తుండడంతో కలెక్టర్ జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం మేరకు గత నవంబరు నెలలో ఇంట్లో తనిఖీలు చేయగా ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్లు లభించడంతో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం శనివారం కలెక్టర్ 20 వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ఓదెల ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యవసాయ మోటర్ల చోరీ నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు పొత్కపల్లి ఎస్సై రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ పుల్ల కరుణాకర్ నిందితుల వివరాలను వెల్లడించారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, జూలపల్లి మండలాల్లో రైతులు బావులు, వాగులు, చెరువులపై సాగునీటి అవసరాలకు అమర్చుకున్న విద్యుత్‌మోటార్లు, సర్వీస్ వైర్లను చోరీకి పాల్పడగా కేసులు నమోదు చేశారు. ఓదెల మండలం శివారు జమ్మికుంటకు వెళ్లే రహదారిలో ఎస్సై దీకొండ రమేష్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాలీ వాహనంలో ఓదెల తారకరామ కాలనీ, బుడిగజంగాల వాడకు చెందిన సిరిగిరి ప్రసాద్, అంగిడి సాయికుమార్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని తనిఖీ



నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపి కరుణాకర్

చేయగా విద్యుత్ మోటార్లు, సర్వీస్ వైర్లు కనిపించడంతో విచారణ చేపట్టారు. జల్సాలకు అలవాటు పడి వీరిద్దరు పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, సుల్తానాబాద్ పోలీస్ సర్కిల్ పరిధిలోనిలో చోరీలకు పాల్పడ్డారని, ట్రాలీలో తిరుగుతూ, జూలపల్లి మండలం కాచాపూర్‌లో ఆరు మోటార్లు, కోనరావుపేటలో ఒకటి, ఓదెల మండలం కొమిర ఎస్సారెస్పీ కాలువ వద్ద ఆరు మోటార్లు, కొలనూర్ శివారులో ఐదు మోటార్లు, పొత్కపల్లి శానగొండ శివారులో నాలుగు మోటార్లు, అలాగే 17 బావుల వద్ద నుంచి 170 మీటర్ల సర్వీస్ వైరు చోరీ చేశారు. రూపునారాయణపేట మానేరు వాగులోని 23 విద్యుత్ బోర్‌మోటార్లు, ఓదెల శివారులోని ఆరు మోటార్లను ఎత్తుకెళ్లారని తెలిపారు. సిరిగిరి ప్రసాద్ ఇనుప సామాను వ్యాపారం చేస్తూ ఆర్థిక నష్టాలకు గురయ్యాడు. దీంతో సునాయసంగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులను పోగొట్టుకున్నాడని తెలిపారు. దీంతో ఇదే గ్రామానికి చెందిన అంగడి సాయికుమార్‌తో కలిసి ఇనుప సామాను దొంగిలించే వారని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.10.67లక్షల విలువ చేసే విద్యుత్ మోటార్లు, 750 మీటర్ల సర్వీస్ వైరును, ఆటో ట్రాలీ, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. దొంగలను పట్టుకున్న ఏఎస్ఐ రత్నాకర్‌తో పాటు 13 మంది పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించి రివార్డులను అందించారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై దీకొండ రమేష్ పాల్గొన్నారు.



చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



ఆ లోటును భర్తీ చేస్తుంది

- మోహనకృష్ణ ఇంద్రగంటి

'అష్టాచెమ్మ', 'గోల్కొండ హైస్కూల్', 'సమ్మోహనం' వంటి చిత్రాలతో సెన్సిబుల్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడవాయూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మోహనకృష్ణ మీడియాతో ముచ్చటించారు. "ఒకప్పటితో పోల్చితో తెలుగులో పూర్తి స్థాయి కామెడీ చిత్రాల సంఖ్య తగ్గిపోయింది. ఆ లోటును భర్తీ చేస్తుందీ చిత్రం. కథానాయకుడి పాత్రకు ఎవరు సరిపోతారా అని వెతికే క్రమంలో, ప్రియదర్శి నటించిన 'బలగం'తో పాటు ఆయన చేసిన మరికొన్ని చిత్రాలు చూశా. ఈ కథకు ఆయనే సరిపోతారనిపించింది. ఇందులో పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. కేవలం థియేటర్లో చూసి ఆనందించడమే కాకుండా.. కొన్ని రోజుల పాటు మాట్లాడుకునేలా ఉంటుందీ సినిమా. అన్ని వర్గాలను మెప్పించే ఈ చిత్రం, కాసేపు మీ కష్టాలన్నింటినీ మర్చిపోయేలా చేస్తుంది. జాతకాలను అతిగా నమ్మే ఓ యువకుడి జీవితంలో జరిగిన ఆసక్తికరమైన సంఘటనలే చిత్రకథాంశం. నమ్మకం మూఢనమ్మకంగా మారి, ఇతరుల్ని ఇబ్బందిపెట్టకూడదనే సందేశాన్ని వినోదాత్మకంగా అందిస్తుంది. సినిమాలో కడుపుబ్బా నవ్వుకునే వినోదంతో పాటు ఓ క్రైమ్ ఎలిమెంట్ ఉంటుంది. అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడిగా ఈ సినిమా నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. ఇప్పుడు ప్రేక్షకుల అటెన్షన్ స్పాన్ తగ్గిపోయింది. వారు థియేటర్లో మొబైల్ తీయకుండా ఉంచగల స్థాయిలో సినిమాలు తీయడం దర్శకులు నేర్చుకోవాలి" అని చెప్పారు.




ఎన్ని అబద్ధాలు చెప్పినా మా సినిమా గెలుస్తుంది

విజయశాంతి

"'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనాలు. క్లైమాక్స్ కోసం కల్యాణ్‌బాబు తీసుకున్న రిస్క్ వల్లే సినిమా ఇంత గొప్పగా వచ్చింది. సినిమాకు నెగెటివ్ ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు. దుష్ప్రచారం చేసేవారు దయచేసి మైండ్‌సెట్‌ను మార్చుకోండి. వారు సినిమా బాగాలేదని ఎన్ని అబద్ధాలు చెప్పినా, చివరికి మా సినిమానే గెలుస్తుంది. కోట్లు ఖర్చు పెట్టి తీసిన సినిమాను బ్రతకనివ్వండి. మనస్ఫూర్తిగా సినిమాను దీవించడం నేర్చుకోండి" అని నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలైంది. సక్సెస్ మీట్‌లో కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "కమర్షియల్ సినిమాలోనూ కొత్తదనం ఉంటేనే ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో దర్శకుడు ప్రదీప్ ప్రేక్షకుల అంచనాలను అందుకున్నాడు" అని చెప్పారు.













వృద్ధురాలి ఆత్మహత్య

వెల్గటూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవి తంపై విరక్తి చెంది పాకాల దేవమ్మ(58) అనే వృద్ధురాలు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థంభంపల్లిలో చోటు చేసుకున్నది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు దేవమ్మ గత 15 సంవత్స రాలుగా ఆస్తమాతో బాధపడుతోంది. దీనికి తోడు గత సంవత్సరం క్రితం కాలు విరగటం వలన ఆపరేషన్ జరిగి మంచానికే పరిమితం అయింది. దీనితో జీవితం పైవిరక్తి చెంది శనివారం కుటుంబ సభ్యులు పనికి వెళ్లిన సమయంలో ఉరి వేసుకున్నది. కుటుంబ సభ్యులు మధ్యా హ్నాం తిరిగి వచ్చి చూసే సరికి దేవమ్మ ఇంట్లో బట్టలు అర వేసుకునే దండెంకి దొతితో ఉరి వేసుకొని చనిపోయి ఉంది. పెద్ద కుమారుడు పాకాల తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై వివవరించారు.

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

ధర్మపురి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన దొహెగాం గిరీష్(41) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండె పోటుతో మృతి చెందాడు. సాయంత్రం వేళలో తన ఇంటి నుండి బయలు దేరిన గిరీష్ తన అన్న ఇంటిలో కుర్చీలో కూర్చొని ఒక్కసారి కుప్ప కూలిపోయాడు. వెంటనే వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించే యత్నంలో అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సందర్శించారు.మృతి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు.

బాధిత కుటుంబానికి చేయూత

కథలాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండకు చెందిన సుద్దాల బుచ్చిరాజు అనే మహిళ ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోగా శనివారం మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, వంటగ్యాస్, చీరెలు, చద్దర్లు వంటివి అందించారు. ఈ సందర్భంగా సతీష్, గంగాధర్, తిరుపతి, సాగర్, రాజేందర్, వంశీ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సందర్శన

మల్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ట్విమ్మింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా పోతారం, తక్కళ్లపల్లి, తాటిపల్లి జడ్పీ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్. జయసింహరావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం.ఖరీం, హెచ్ఎం.శ్రీనివాస్, రవీం ధర్, సత్తయ్య, నర్సింగరావు, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రథశాల నిర్మాణానికి భూమి పూజ

కొడిమ్యాల, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి రథశాల నిర్మాణానికి శని వారం ఆలయ నిర్మాణ కమిటీ, గ్రామైఖ్య సంఘం ఆద్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, సభ్యులు సంతోష్, రమణ పాల్గొన్నారు.

అకాలవర్షంతో అన్నదాత అతలాకుతలం

కథలాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్ళ ముందే నేలరాలడం రైతులను తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. శుక్రవారం వీచిన ఈదురు గాలుల కారణంగా మండలంలోని బొమ్మెన, భూషణ రావుపేట, కథలాపూర్, చింతకుంట, తక్కళ్ళపల్లి గ్రామాల్లో మామిడి కాయలు సగం మేర రాలిపోయాయి. అసలే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా కాత అంతంత మాత్రం గానే రాగా ఈదురు గాలులకు అందులో సగం రాలి మామిడి రైతుకు దిగాలును మిగిల్చింది. రాలిపోయిన మామిడి కాయలను విధి లేని పరిస్థితుల్లో మార్కెట్‌కు తరలిస్తున్న రైతులకు కిలో రూ.50లు కూడా ధర రావడం లేదని ఆవేదన వెలిబుచ్చుతున్నారు.



కథలాపూర్‌లో నేలవాలిన నువ్వు పంట

●కథలాపూర్, అంబారిపేట సెక్షన్లలో భారీ ఈదురు గాలులకు ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డ క్రమంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భూషణరావుపేట, బొమ్మెన, సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగి వినియోగదారులు అసౌకర్యానికి గురయ్యారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం తెల్లవారుజామున దాకా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం ఎన్‌పీడీసీఎల్ ఏఈ, ఏడీఈ వివిధ గ్రామాల్లో పర్యటించి యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టినా సాధ్యం కాలేదు. పూర్తి స్థాయిలో అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా చేయలేని పరిస్థితి నెలకొందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షం రావడంతో అన్నదాతకు తీవ్ర నష్టంలోకి నెట్టింది. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి 2254 వేల ఎకరాల పంటలు నేలకొరిగి దెబ్బతిన్నాయని వ్యవసాయా, దికారులు ప్రాథమికంగా గుర్తించారు. అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను శనివారం మండలంలోని వెల్లుల్ల గ్రామంతో పాటు పలు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి దీపిక పరిశీలించారు. మండలంలో వరి 1133, సజ్జ 432, నువ్వు 689 ఎకరాలలో పంటలు దెబ్బతిన్నయని ఆమె ప్రాథమికంగా అంచన వేసి జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

భీమారం: మండలంలో శుక్రవారం కురిసిన వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, మండల వ్యవసాయ అధికారి ఎండీ షాహిద్ అలీతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్, ఏఈవో సురేందర్ నాయక్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

రాయికల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు మిల్లెట్స్‌పై అవగాహన కల్పించారు. ఆకు కూరలు, చిరుధాన్యాలు, కూరగా యలు ఎక్కువ మోతాదులో తీసుకోవాలన్నారు. సీజనల్‌గా దొరికే పండ్లను తీసుకోవాలని, అయోడ్ ఉప్పును వాడాలన్నారు. ఆరు నెలల పిల్లల నుంచి ఆరు సంవత్సరాల వరకు అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచాలని అన్నారు. గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ పిల్లలకు ఏబీసీడీల క్యాలెండర్ చార్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉప్పుల రమాదేవి, మిట్టపల్లి పద్మ, దీకొండ ఉమాదేవి, ఏఎన్ఎం సరిత, ఆశాలు, భారతి పాల్గొన్నారు.

●కొడిమ్యాల, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 3వ, 4వ అంగన్‌వాడీ కేంద్రాలలో, మండలంలోని చెప్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమంలో బాగంగా శనివారం పోషక ఆహారంపై అవగాహన కలిపించారు. వ్యాయామం ప్రాముఖ్యతను వివరించారు. చారు. పండ్లు, కూరగాయాలు, చిరుధాన్యాలపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు సుధారాణి, ఉమ, అంగన్‌వాడీ టీచర్లు హసీనా, కాంతమ్మ, ఉమ, జ్యోతి, సుజాత, అంజలి పాల్గొన్నారు.

●కథలాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పోషక విలువలు గల వంటకాలను తయారు చేసి వాటి ప్రాముఖ్యత గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైమదీబేగం వివరించారు. మండలంలోని అంబారి పేటలో శనివారం పోషణ పక్షోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, 0 నుంచి 2 సంవత్సరాల చిన్నారులకు పోషకాలు పుష్కలంగా ఉండే పదార్థాలు, కూరగాయలను ప్రదర్శించి చూపించారు.

గీత కార్మికుల రక్షణకే కాటమయ్య కిట్లు



కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర గౌడకులస్థుల రక్షణనే ధ్యేయంగా గౌడవృత్తి చేసేవారి కోసం కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో 42 మంది కల్లుగీతకార్మికులకు 100 శాతం సబ్సిడీతో కాటమయ్య రక్షణ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి సునీత, తహసీల్దార్ శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్ఐలు రాజేందర్, స్వప్న, మేఘమాల, పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉంటూ అన్ని విధాల అండగా ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. చల్‌గల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మెన్ మహిపాల్ రెడ్డి, డీసీవో మనోజ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మెన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ అన్నారు. పట్టణంలోని స్థానిక గీతా విద్యాలయం మైదానంలో జిల్లా గంగపుత్ర భీష్మ క్రికెట్ ట్రోఫీ-2025ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు.

ఏకరూప దుస్తుల కొలతల సేకరణ

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులకు సబంధించి రూరల్, అర్బన్ మండలాల్లో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కొలతలను సేకరిస్తున్నామని జగిత్యాల మండల ఐకేపీ ఏపీఎం ఓదెల గంగాధర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సూచనల మేరకు ప్రతి విద్యార్థి, విద్యార్థినిలకు సరియైన కొలతలను సేకరించి మహిళా సంఘాల సభ్యులచే కుట్టిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సీసీలు గంగారాం, రవీందర్, మరియా, విద్యాసాగర్, గంగారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

కొడిమ్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రోఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలని మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళా శాలలో విదులు నిర్వహిస్తున్న కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రోఫెసర్లు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రోఫెసర్ల అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజ నీరింగ్ కళాశాల గేట్ ఎదుట నిరవధిక సమ్మెను ప్రారంభించారు.

పశు వైద్యశిబిరం సందర్శన

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వాక్సినేషన్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా పశు వైద్యాదికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శనివారం గొల్లపెల్లి మండలం రాఘవపేట గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిభిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియమాలు పాటించడంతో పాటు వాక్సిన్ కోల్డ్ చైన్ మెయింటేయిన్ చేయాలని సిబ్బందికి సూచించారు. మండల పశు వైద్యాధికారి రవీందర్, లివ స్టాక్ అసిస్టెంట్ సంధ్య పాల్గొన్నారు.

అడవి పంది మాంసం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

రాయికల్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి) : రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన దండుగుల నర్సయ్య అనె వ్యక్తి అడవి పంది మాంసం విక్రయిస్తున్నడనె సమాచారం మేరకు అటవీ అధికారులు దాడుల నిర్వహించారు. ఈ దాడిలో పంది మాంసం విక్రయిస్తున్న నర్సయ్యను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి భూమేష్ తెలిపారు. ఈ దాడుల్లో సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, బీట్ ఆఫీసర్ పాషా పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

మల్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంకు చెందిన వివాహిత మహిళ(32) అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పరి లక్ష్మి మూడవ కొడుకు శ్రీధర్‌కు రజిత అనే మహిళకు 12 ఏళ్ల క్రితం వివాహం జరుగగా ఏడాది క్రితం ఉపాధి కోసం శ్రీధర్ దుబాయి వెళ్లాడు. అయితే లక్ష్మి రెండవ కోడలు శుక్రవారం ఉదయం శ్రీధర్ భార్య రజిత వద్దకు వెళ్లగా ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో కుటుంబసభ్యులు పలు చోట్ల ఆమే కోసం వెదికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం అత్త ఉప్పరి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిరాంపుర కాలనీలో నివాసం ఉంటున్న మేడిపల్లి మండలం మన్నెగూడెం గ్రామనికి చెందిన ఎలిగెట్టి శ్రీహరి (39) అనే యువకుడు కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీహరి కొన్ని రోజులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంకు వెళ్లి ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య లాస్యతో గొడవకు దిగేవాడన్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇరువురి మధ్య గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బెడ్ రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసున్నారు.

మున్సిపల్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల క్రితం ఎలాంటి అనుమతి లేకుండా మూడు అంతస్తుల భవనం నిర్మించి మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టి మార్చి1వ తేదీన కొత్తగా నిర్మించినట్లు అనుమతులు ఇచ్చిన మున్సిపల్ లైసెన్స్‌డ్ ఇంజనీర్ మరియు ఇతర అధికారులను సస్పెండ్ చేయాలని జగిత్యాల పట్టణానికి చెందిన చిగుర్ల భగవాన్ రాజ్ అనే వ్యక్తి కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన ఏనుగేల మల్లయ్య అనే వ్యక్తి పది సంవత్సరాల క్రితం నిర్మించిన ఇంటికి అనుమతులు ఇచ్చిన విషయమై నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినప్పటికి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అక్రమంగా ఇంటిని నిర్మించిన ఏనుగుల మల్లయ్యతో ఇతర మున్సిపల్ అధికారులను శిక్షించాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో వివాదం

మల్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో అధికార పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వివాదం నెలకొని ఇరువర్గాల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. మల్యాల మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సత్యం ప్రారంభించగా మిగితా గ్రామాల్లో రెండు రోజులుగా మల్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్ ప్రారంబి స్తున్నారు. కేంద్రాల ప్రారంభం ఆలస్యం కావడంతో పలువురు రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాలతో శనివారం పోతారం, నూకపల్లి సింగిల్‌విండో పరిదిలోని రాజారం, పోతారం, గొల్లపల్లి, రాంపూర్, ఓబులాపూర్, గొర్రెగుండం గ్రామాల్లో ప్రారంభంకు ఏర్పాట్లు చేశారు. ఆయా సింగిల్‌విండోలకు చైర్మన్లుగా బీఆర్ఎస్‌కు చెందిన వారు ప్రాతినిధ్యం వహిస్తుండగా గత ఫిబ్రవరిలో ముగిసిన వారి పదవికాలంను ప్రభుత్వం పొడగించలేదు. శనివారం ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభంకు ఏఎంసీ చైర్‌పర్సన్ రావడం వారు వచ్చే ముందే చైర్మన్లు సాగర్‌రావు, మధుసూధన్ రావు, కొబ్బరికాయలు కొడుతూ రైతులతో ప్రారంభించడం పట్ల ఏఎంసీ చైర్‌పర్సన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. ఇది కాస్తా వివాదంగా మారగా ప్రొటోకాల్ వరకు వెళ్లింది. ఎంపీ, ఎంఎల్‌సీలకు సమాచారం అందించకుండా కొనుగోలు కేంద్రాలు ఎలా ప్రారంబిస్తారని సింగిల్‌విండో చైర్మన్లు పేర్కొనడంతో గత బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడైన ప్రోటోకాల్ పాటించారా అని కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడి చేశారు. అయినా ఎంపీ, ఎమ్మెల్సీలకు సమాచారం అందించాల్సింది సీఈవోలని అలాంటప్పుడు తమను బదనాం చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం ఆయా సహకార సంఘాలకు పొడగింపు అవకాశం ఇవ్వలేదని అలాంటప్పుడు కేంద్రాలను ఎలా ప్రారంబిస్తారని పేర్కొన్నారు. సింగిల్‌విండోల సీఈవోలపై జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేసినట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ మల్లీశ్వరిశ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ

కథలాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వీచిన భారీ ఈదురుగాలుల కారణంగా షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన రిఫ్రిజిరేటర్లను జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ పరిశీలించారు. కాలిపోయిన వ్యాక్సిన్ క్యారియర్ బాక్స్‌లు, డీప్ రిఫ్రిజిరేటర్లను పరిశీలించారు. బుధ, శనివారాల్లో నిర్వహించే వ్యాక్సినేషన్‌ను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తెచ్చుకుని యధావిధిగా కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు ఎంత మేర నష్టం జరిగిందనేది అంచనాలు వేసుకున్నారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ పరిశీలకులు అతుల్, ఆకుల శ్రీనివాస్, టెక్నీషియన్లు, వైద్యాధికారిణి సింధూజ, హెచ్ఈఓ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ రాజయ్య తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట చేస్తున్న వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావు అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్ కమిటీలో చైర్మెన్ పన్నాల అంజిరెడ్డితో కలిసి దాన్యం కోనుగోలు కేంద్రను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, గడ్డం వేంకటేష్, పుప్పాల ప్రభాకర్, ముత్యాల గంగాధర్, బూరుగు రామస్వామి గౌడ్, గణేష్, రాకేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గాలి వాన బీభత్సనికి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంను వ్యవసాయ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. నష్టపోయిన పంటలపై అంచనాలు వేసి ప్రభుత్వాని పంపాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ లావణ్యలతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కోనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రహించి మద్ధతు ధర పొందాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు, వెల్లుల్ల, చౌలమద్దితో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మెట్‌పల్లి విశాల సహకార సంఘం అధ్యక్షుడు కామిరెడ్డి తిరుపతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, నిర్వహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందించాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరాకు 25 వేల నష్ట పరిహారం అందించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శనివారం మండలంలోని కోజన్‌కొత్తూర్, ఇబ్రహీంపట్నం, కేశపూర్, ఎర్దండి గ్రామాలలో భారీ వర్షాలకు నష్టం జరిగిన పంట పోలాలను ఆయన పరిశీలించారు. ఎర్దండి గ్రామంలో భారీ వర్షాలకు గుడిసెలు నెలకూలగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. జరిగిన పంట నష్టంను వ్యవసాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరి రఘునందన్‌కు ఫోన్‌లో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. అధికారులు పంట నష్టం సర్వే నిర్వహించి నివేధికలను ఉన్నతదికారులకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయదికారి భాస్కర్, ఏడిఏ రమేష్, తహశీల్దార్ ప్రసాద్, మండల వ్యవసాయదికారి రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు నోముల లక్ష్మరెడ్డి, బద్దం గోపి, దశరత్‌రెడ్డి, నేమూరి సత్యనారయణ, జగన్‌రావు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ధర్మపురి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎలిమెంటరీ, సెకండరీ స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గణిత, సామాన్యశాస్త్ర అంశాలపై శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. దమ్మన్నపేట, తిమ్మాపూర్, పెద్దనక్కలపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రిత్విక్, హన్విత, సందీప్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ధర్మపురి ఎంఈవో సీతాలక్ష్మి బహుమతులు అందించారు. ఈ నెల 21 న జరిగే జగిత్యాల డీసీఈబీలో నిర్వహించే క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని ఎంఈవో సీతాలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు కొలిచాల శ్రీనివాస్, సబ్జెక్ట్ ఫోరమ్ టీచర్లు చల్ల జనార్ధన్, శీలం రాజేష్, రవీందర్, రాజేశం, కృష్ణ, గైడ్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి పోటీలను నిర్వహిస్తె పోటీతత్వం పెరిగి ముందుకు సాగుతారన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిద పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

●రాయికల్: రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌లో భాగంగా శనివారం మండల విద్యా కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిం చారు. గెలుపొందిన విజేతలకు పీఆర్ టీయూ టీఎస్ ఆధ్వర్యంలో డిక్షనరీలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేష్, టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు బొల్లె చిన్నయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం పాల్గొన్నారు.

●బీర్‌పూర్:బీర్‌పూర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం మండలస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు.

●వెల్గటూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వెల్గటూరు మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ పాల్గొన్నారు.

●కథలాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచారని ఎంఈఓ లోకిని శ్రీనివాస్ తెలిపారు. విజేత లుగా నిలిచిన వారు నెల 21న జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి పోయారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, చిలుకముక్కు రమణాచారి, నంబి నరసింహమూర్తి నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకోవటం అగుపించింది. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది తగు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

'రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి'

వెల్గటూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న అన్ని వర్గాల వారికి సమ న్యాయం చేకూర్చే విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాగం ఫలాలు అందరికీ అందించాలనే ఉద్దేశంతో రాజీవ్‌గాంధీ పంచాయితీ రాజ్ సంఘటన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్‌లో భాగంగా స్తంభంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన శ్రమదానంలో మండల నాయకులతో కలిసి విప్ పాల్గొన్నారు. అనంతరం స్తంభంపల్లి హరిత హోటల్‌లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన సర్వోదయ సంకల్ప శిభిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల సర్వోదయ సంకల్ప శిబిరం, శ్రమదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఎంతో మంది పోరాటం చేసి దేశానికి స్వాతంత్రం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ అసెంబ్లీ ఇంచార్జి సిద్దేశ్వర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేంధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి, నాయకులు మెరుగు మురళి, పోలోజు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, చంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న విప్

వెల్గటూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలం లలోని స్తంభంపల్లి గుట్టపై కొలలువైన శ్రీ వెంకటేశ్వర స్వామిని శనివారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం కల్యాణ వేదికకు భూమి పూజ నిర్వహిం చారు. అనంతరం పాశిగామకు చెందిన కంటెం తిరుపతి రోడ్డు ప్రమాదానికి గురి కాగా ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, మద్దుల గోపాల్‌రెడ్డి, పాదం దుబ్బ స్వామి, గొంటి కిరీటి పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

●రాయికల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. మండలంలోని రాయికల్, మహితాపూర్ గ్రామాల్లో శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

●బుగ్గారం: మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షులు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి కోరారు. బుగ్గారం, సిరికొండ ,మద్దునూరు గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

●రాయికల్: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యా యుడు సిరిపురం మహేష్ జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి సాధించాడు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు ఘనంగా సన్మానించారు.

●కథలాపూర్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా తక్కళ్ళపల్లికి చెందిన జిల్లా రాజును నియ మిస్తూ జిల్లా అధ్యక్షుడు పరుశురాం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

●కోరుట్ల: పట్టణంలోని హోటల్, కిరాణం, ప్లాస్టిక్ ఏజన్సీలపై శనివారం సానటరీ ఇన్‌స్పెక్టర్లు అశోక్, జగదీశ్వర్‌లు తమ సిబ్బందితో దాడులను నిర్వహిం చారు. హోటలల్లో నిలువ ఉన్న తిను బండారాలను పరిశీలించి కల్తి పోయిన వాటిన స్వాదీనం చేసుకున్నారు.

●ఇబ్రహీంపట్నం: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు యాదగిరిబాబు డిమాండ్ చేశారు. శనివారం మండలం లోని కోజన్‌కొత్తూర్, ఇబ్రహీంపట్నం గ్రామాలలో భారీ వర్షాలకు నష్టం జరిగిన పంట పోలాలను ఆయన పరిశీలించారు.

●మెట్‌పల్లి రూరల్ : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జగ్గసాగర్, బండలింగాపూర్, మేడిపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు పరిశీలించారు.